
'రచన' మాసపత్రిక - మార్చి 1992

## కథా ప్రహేళిక -4



# రచన

మా బంధువులు 'అమ్మాయికి పెళ్ళెప్పుడూ?' అని అడుగుతున్నారు. దాంతో....

ఈ మధ్య రచన గుర్తు వస్తోంది.

ఆ రోజు...

రచన తన వివాహ శుభలేఖను అందించింది.

ఎంత ప్రయత్నించినా నా మనోభావాలను ముఖం నించి తప్పించలేకపోయాను.

ఊరుకోలేదు రచన.

"అమ్మయ్య - అనుకుంటున్నావా?" అంది.

నేను మాట్లాడలేదు. శుభలేఖ తెరిచాను.

"గోపీ నేనూ పెళ్ళాడుతున్నాం. వస్తారు కదూ!

- రచన"

ఆ శుభలేఖ నాకు ఆశ్చర్యం కలిగించలేదు.

"యింకా డౌటా - నీ పేరుందేమోనని!" అంది.

తలెత్తి చూసాను.

రచన చూపులో చూపు కలపటమూ, నిలపటమూ కష్టం. కుతూహలం ఆగటం లేదు. ఎక్కడయినా కొంచెమయినా బాధా ఛాయ దొరక్కపోతుందా - వెదికాను.

నిరాశే మిగిలింది.

వివిన మూర్తి

శుభ్రమయిన గాలీ వెలుతురూ వచ్చే గది లాంటిది రచన. ఉరకలు, పరుగులతో యిరుకు రాళ్ళ సందుల నుంచి దూసుకుపోయే ఏరు రచన.

ఆమె ముందు నిలబడితే అందం మీదకు దృష్టి సాగదు. ఆమెతో మాట కలిపితే అనాలోచితంగా వేసిన స్విచ్చితో మనమీద కేదో కాంతి ప్రవాహం జారినట్లుంటుంది. ఎన్నో విషయాలు.. ఎన్నో భావాలు....

"క్షమించు రచనా!"

ఆ మాటనయినా అనే ధైర్యం నాకు లేకపోయింది.

క్షమించేసిందని నాకు తెలుసు.

"అబ్బాయ్! నోటమ్మట ముత్యాలు రాలిపోతాయని కంగారు పడుతున్నట్లున్నావ్! ఎత్తుకోవటానికి నాకు టైం లేదు. వస్తాను. నువ్వు పెళ్ళికి వస్తావ్!"

రచన వెళ్ళిపోయింది.

నేను లైబ్రరీలో నా సీట్లో కూర్చుని కళ్ళు మూసుకున్నాను.

'అంకుల్ అంకుల్' అంటూ ఓ కుర్రాడు పిలుస్తున్నాడు.

రెన్యూ చెయ్యాలిట.

మా కొలీగ్‌ని పిలిచి పని అప్పజెప్పి బయట పడ్డాను. సముద్రపు గాలి వస్తోంది.

విశాఖపట్నం చేరి నాలుగేళ్ళయింది. అంతకు ముందు నా చదువు కాకినాడలోనే సాగింది. ఒక్క లైబ్రరీ సైన్స్ మటుకు యూనివర్సిటీలో చేసాను. అప్పుడే నాకు స్నేహితులంటూ ఏర్పడ్డారు.

'నువ్వు మీ గంగనాపల్లి వదిలావు. బయట ప్రపంచముందని నీ మట్టిబుర్రకి తెలిసింది. దాంతో స్నేహాలు మొదలయాయి' - అనేది రచన.

నిజమే!

మా వూరి నుంచి కాకినాడ సైకిలు మీద వచ్చేవాడిని. అక్కడే మెక్లారిన్ హైస్కూలూ, తర్వాత పి.ఆర్. కాలేజీల్లో చదివాను.

'బయట తిరిగావా చెడిపోతావ్!' అనేవాడు మా నాన్న.

ఆయనంటే మాకు సింహస్వప్నం. ఫలానీ టైంకి యింట్లో ఉండాలని ఆర్డరు వేసాడంటే హరి మీద గిరి పడ్డా గిరి మీద హరి పడ్డా ఉండవలసిందే! చివరకు మా వూళ్ళో కూడా మా పిల్లలం బయటకు వెళ్ళటానికి వీల్లేదు. పుస్తకాలూ, పత్రికలూ ముట్టుకోటానికి లేదు. చిన్న చిన్న పనులకి కూడా మేం వూరు వదిలి వెళ్తే ఆయన తోడు రావాలి.

మా నాన్న స్నేహితుడు జగన్నాథం. జిల్లా పరిషత్ విశాఖపట్నంలో పియేగా పనిచేస్తున్నాడు. విశాఖపట్నంలో యీ చదువులో పెట్టమని ఆయన నాన్నకు సలహా



యిచ్చాడు. చదువయాక ఉద్యోగం చూస్తానని హామీ యిచ్చాడు.

అలా విశాఖపట్నం చేరుకున్నాను.

చెంగల్రావు పేటలో తెలిసున్న వాళ్ల యింట్లో ఓ గది కుదిర్చాడు నాన్న. ఇంటి యజమాని

సత్యన్నారాయణ.

"వీడుత్తి వెధవండి బావగారూ! పని లేకుండా పెరట్లోకి కాలు పెట్టాడా - కాళ్ళు విరగ్గొట్టండి. టైంకి యింటి పట్టున ఉండకపోతే ఓ కార్డు ముక్క రాసి పడెయ్యండి! వచ్చి తోలు వలిచేస్తాను. వెధవకి!" అంటూ పది కార్డులనూ, నన్నూ ఆయన చేతిలో పెట్టాడు.

"ఆ జగన్నాధంగాడు నిన్నిక్కడ యీ చదువులో పెట్టమన్నాడు. చదువు అయీ అవగానే ఉద్యోగం వేయిస్తానన్నాడు. వాడుత్తి మాయల మరాటీ! అన్నాడూ అంటే వేయిస్తాడు. చేసే ఉద్యోగం చిన్నదయినా పెద్ద పెద్ద వాళ్ళందరినీ గుప్పెట్లో పెట్టుకుంటాడు. వాడిదంతా ఊరికినే మాత్రం చేయడు. ముగ్గురు కూతుళ్ళున్నారు. ఎవరినో ఒకరిని నీకు అంటగడదామని వాడి ఎత్తు. నిన్ను యింటికి రమ్మంటాడు. ఎప్పుడైనా వెళ్ళు! గంటల తరబడి కూర్చోకు! ఏం జరుగుతున్నదీ నాకు ఎప్పటికప్పుడు తెలియజేయి. ఆఫీసులో మాత్రం వాడిని కలుస్తూండు"

అలా కట్టుదిట్టం చేసి నన్ను విశాఖపట్నంలో వదిలి వెళ్ళిపోయాడు మా నాన్న.

మా యింటి ఓనరు ఆ కార్డులని ఎప్పుడూ వాడలేదు. అద్దె గురించి తప్ప నా గురించి పట్టించుకోలేదు. జగన్నాధంగారూ నన్ను వాళ్ళ యింటికి రమ్మనమనలేదు. నాలుగయిదు నెలల తర్వాత మా నాన్న వ్రాసిన ఉత్తరం ప్రకారం నా అంత నేనే ఆయనతో అన్నాను - "అత్తయ్యగారిని చూసి చాలా చాలా కాలమయింది. మా నాన్న చూసి రమ్మని రాసారు"

దానికి ఆయన ముక్తసరిగా - "ఆవిడ ఊళ్ళో లేదు" అనేసి ఊరుకున్నాడు.

అలా లభించిన స్వేచ్ఛతో నాకు రామకృష్ణా బీచ్ అలవాటయింది. సిగరెట్లు అలవాటయాయి. స్నేహితులు అలవాటయ్యారు. పుస్తకాల షాపుల నించి బూతు పత్రికలు అద్దెకు తెచ్చుకోవటం అలవాటయింది.

అలాంటి పరిస్థితిలో ఒక రోజు రచన నా జీవితంలోకి ప్రవేశించింది. ఆ రోజు నేను ఎలా మరువగలను?

అప్సర హోటల్ ఎదురుగా బస్టాపులో నుంచున్నాను. రాత్రి ఎనిమిది దాటిందను కుంటాను. నాతో పాటు ప్రయాణీకులు ఎవరూ లేరు. జగదాంబ నుంచి వాల్తేరు పోయే బస్సు సైకిల్ మీద పోతున్న ఓ నడివయస్కుడిని గుద్దేసి వెళ్ళిపోయింది. నేనది గమనించలేదు. రచన వచ్చి నన్ను లాక్కుపోయింది.

సైకిల్ నుగ్గు నుగ్గయి పోయింది. అదృష్టం బావుంది. మనిషి ఎగిరి రోడ్డు పక్కనున్న కంకరరాళ్ళ గుట్టపై పడ్డాడు. మనిషిని సాయం పట్టి ఆటోలో చేర్చాం! కె.జి. హెచ్.లో

చేర్చాం! జేబులో చెయ్యి పెట్టలేదు రచన. కాని అంత పనీ చేసి ఆటోకి డబ్బులు చెల్లించింది. కాజువాల్టీలో లేని డాక్టర్లని రప్పించింది. రచన ధాటికి డాక్టర్లు, నర్సులు హాజరై పోయారు. బ్లడ్ కోసం నన్ను పరిగెత్తించింది. మందుల కోసం పరిగెత్తించింది. నేను సాధించుకు రాలేనప్పుడు తనూ వచ్చి సాధించింది.

రాత్రి రెండు గంటలకి రోగికి తలలో దూరిన కంకరరాళ్ళు తీసి శుభ్రం చేసారు. రక్తం ఎక్కించారు. మూడు గంటల ప్రాంతంలో రోగి తన చిరునామాను చెప్పగలిగాడు. డాక్టర్లు ప్రమాదం నుంచి బయటపడ్డట్టే నన్నారు.

ఆ చిరునామాతో 'పద' అంది రచన. ఆ రాత్రి వేళ నన్ను తోడుగా పిలిచిందనుకున్నాను. ఆ తర్వాత ఓ మారు చెప్పింది - "నీ మొహం! ఆసుపత్రిలో కాలు పెట్టగానే నీకు వాంతులవుతాయని కంగారు పడ్డాను. ఆ రాత్రివేళ ఒక్కడినీ పంపినా లాభం లేదు గదా!" అంది.

అప్పటి వరకు అనేక విషయాలు మాట్లాడినా నా వివరాలు అడగలేదు రచన. తన వివరాలు చెప్పలేదు. అప్పుడు చెప్పింది. ఏవియన్ కాలేజీలో బి.ఏ. పోలిటిక్స్ చదువు తోందట.

"మా అమ్మ నూరున్నిసా! నాన్న... రాజగోపాలం" అంది గొప్పగా.

ఆ రెండు పేర్లనీ కలిసి విన్న షాక్ నించి తేరుకోకుండానే -

"మా నాన్న పేరు వినే వుంటారు"

"వినలేదు!"

"ఛా!" అంది ఆశ్చర్యంగా.

"ఎవరాయన?"

"పత్రికలు చదవటం అలవాటు లేదా నీకు?"

"అప్పుడప్పుడు చూస్తాను" అన్నాను మొహమాటంగా.

"రాచకొండ విశ్వనాథశాస్త్రి.... కాళీపట్నం....కొడవటిగంటి... బలివాడ... మధురాంతకం... అవసరాల...." అంటూ అడగసాగింది. తెలీదన్నాను.

"యద్దనపూడి...కోడూరి.... మాదిరెడ్డి... ముప్పాళ్ళ..." మరో లిస్టు చదవసాగింది. నాకెవరూ తెలీదన్నాను.

"నువ్వు లైబ్రరీ సైన్సు చదువుతున్నావు" అంది.

"అవును" అన్నాను.

ఆగిపోయిన రచన తల అటూ యిటూ ఆడించి కదిలింది.

వాళ్ళ నాన్న కవిట. వాళ్ళ అమ్మ సంగీతం పాడుతుందిట. అలా వాళ్ళ నాన్న గురించి

రచన చెప్పినది నన్నెంత ఆశ్చర్యపరచిందో నా గురించి ఆమె తెలుసుకున్నవీ అంతే ఆశ్చర్య పరిచాయని తర్వాత తెలిసింది.

ఆ రాత్రి ఆ చిరునామాతో ఆ వ్యక్తి భార్యాబిడ్డలకు సంగతి చెప్పి ఆసుపత్రికి చేర్చాక నన్ను వదిలింది రచన.

"- నీ డబ్బులు పంపిస్తాను. అడ్రస్ చెప్పు" అంది.

చెప్పలేదు. మా నాన్న ఆదేశాలు బాగా గుర్తున్నాయి. 'పట్నవాసప్పిల్లలకీ మేజువాణీ పిల్లలకీ తేడా లేదురా వెధవా! నీ దగ్గర డబ్బులుచ్చుకునయినా వదిలేస్తారు వాళ్ళు. వీళ్ళు నీ మెళ్ళో తాడేసి నిన్నుం చేసుకుంటారు - జాగ్రత్త! అఘోరిస్తావ్!' అన్నాడాయన.

"ఫరవాలేదండి" అనేసి బయల్దేరాను. సూర్యుని తొలి కిరణాలనూ, సముద్రపు గాలినీ అనుభవిస్తూ మా రూమ్‌కి వెళ్ళిపోయాను.

అలా పరిచయమయింది రచన.

రచనను నేను మరిచిపోలేదు. ఆమె ఆడపిల్ల కావటమే దానికి కారణం. నా జీవితంలో ఓ ఆడపిల్ల నా శరీరానికి ఆ మాత్రం దగ్గరగా అంతసేపు ఏనాడూ మసలలేదు. అలాగే నా మనసుకి కూడా అంత దగ్గరగా ఎవరూ కదలలేదు.

నేను బూతు పత్రికలు తెచ్చుకున్నపుడూ, రామారావు వాణిశ్రీ మీద కసిగా ఉందని మీద పడిన సినిమా చూసినపుడూ నాకు రచన గుర్తు వచ్చేది. అలా గుర్తు వచ్చినందుకు కలిగిన బాధలో మొదటిసారిగా ఆ పత్రికలను ముట్టుకోరాదన్న నిర్ణయానికి వచ్చాను.

జగన్నాథంగారిని జిల్లాపరిషత్‌లో కలియటమనే మా నాన్న వేసిన డ్యూటీని పూర్తి చేసుకుని వస్తున్నాను. కలెక్టర్ ఆఫీస్ దగ్గర నన్ను పట్టుకుంది రచన. గురజాడ కళామందిరంలో శ్రీశ్రీ, గద్దర్ మొదలైన వాళ్ళ మీటింగ్ ఉందంది. వాళ్ళెవరో చెప్పింది.

ఇద్దరమూ ఇసకలో కూర్చున్నాము.

కరంటు పోయింది. వాళ్ళేదో మాట్లాడుతూనే వున్నారు. ఏమో పాడుతూనూ వున్నారు. రచన మధ్య మధ్యలో కబుర్లు చెబుతూనే వుంది.

"శ్రీశ్రీ చెడిపోయాడని మా నాన్న అంటాడు. నేనా మాట ఒప్పుకోలేదు. పూర్వపు కవులు దేవుడి మీదే పద్యాలు చెప్పారు. ఆడాళ్ళను వర్ణించారు. నువ్వు ప్రేమ మీద చెప్పావు. బ్రిటిష్ వాళ్ళని తిట్టావు. గాంధీని పొగిడావు. రాట్నం వడికావు. జైలుకి నడిచావు. ఇప్పటికీ లోహియా మీదా, జయప్రకాష్ మీదా పద్యాలు కడతావు. దేముడి మీదే పద్యాలు కట్టేవాళ్ళ దృష్టిలో నువ్వూ చెడిపోయినట్టే లెక్క - అని వాదించాను. మా నాన్న దెబ్బకి డౌనయిపోయాడు".

ఆ యిసుకలో చల్లని గాలిలో రచన పక్కన కూర్చునుంటే నాకు ఎంతో బాగుంది.

మా నాన్న గుర్తు వస్తున్నా రచన మరీ మేజువాణీగా కనిపించకపోవటంతో కొంచెం ధైర్యంగా ఉంది.

రచన ఆ పాటలు వింటూ పొందుతున్న ఉత్సాహాన్ని చూస్తే నాకు ఆశ్చర్యం కలిగింది. మా దగ్గరికి ఒక ముసలాయన చందాల కోసం వచ్చేసరికి చటుక్కున లేచి నమస్కరించింది రచన. నా జేబులో చెయ్యి పెట్టి డబ్బులు తీసి ఆయన జోలిలో వేసింది.

"శ్రీశ్రీని నా కళ్ళతో చూసాను. దగ్గరగా చూసాను. మనం ఆయన తరంలో పుట్టాం. ఎంత అదృష్టం మనది! రేపొద్దుట నీ పిల్లలకీ మనవలకీ చెప్పుకో!" అంది.

రచన ఉత్సాహం నాకేం బోధపడడం లేదు. అతి విచిత్రంగా ఉంది.

"ఎవరీయన?" అడిగాడు.

రచన చెప్పింది. చాలా ఓపికగా చెప్పింది. ఆ రాత్రి పదకొండున్నర ప్రాంతాలలో యిద్దరమూ బయలుదేరి అల్లిపురంలో వాళ్ళ యింటికి చేరే వరకూ చెపుతూనే వుంది.

"మా నాన్న పద్ధతులు నాకు చిరాకులే! ఆయన గాంధీగారి కాలి మట్టి తీసి దాచుకున్నాడు. మా అమ్మ యిచ్చిన జేబు రుమాలునీ దాసుకున్నాడనుకో! ఈ రోజు శ్రీశ్రీని చూస్తుంటే ఆయన కాలి మట్టి తీసి దాచుకోవాలనిపించింది. కోరిక ఆపుకోలేక ముట్టుకోవాలనుకన్నాను తెలుసా! ఎవరైనా నచ్చితే వాళ్ళ భావాలతో జీవించాలి గాని వాళ్ళ అనవాళ్ళతో జీవించటమేంటీ అసహ్యంగా! జీవితమంతా నూతనత్వాన్ని ఆహ్వానించుతూనే వున్న శ్రీశ్రీ యీ రోజు ఆయన చెప్పిన దాంతో యీ రోజు నన్ను మార్చేసాడు" అంది.

వింటూనే వున్నాను. జూన్ నెల రాత్రి విశాఖ గాలిలో రచన పక్కన నడుస్తున్నానన్న మైమరపులో వున్నాను. ఆ తర్వాత అనేక మార్లు తర్కించుకున్నాను. అది ఆడపిల్ల కావటం వల్లా? రచన కావటం వల్లనా? రచన పక్కననే అనుకోవటం వల్ల నాకు ఆ రోజుల్లో చాలా తృప్తిగా ఉండేది.

అంత రాత్రి వాళ్ళ యింటికి తీసుకెళ్ళి 'మహాప్రస్థానం' యిచ్చింది. "చదివి యివ్వు" అంది.

ఏ తండ్రయినా పిల్లల కివ్వాల్సిన అసలు ఆస్తి 'మహాప్రస్థానం' - రచనకు రాజగోపాల శర్మ అని ఆ పుస్తకం మీద రాసి ఉండడం నాకు యిప్పుడూ గుర్తు వస్తూంటుంది.

అలా మా పరిచయం బలపడింది. రచన యిస్తున్న పుస్తకాలు చదువుతున్నాను. ఆమె మాటలు వింటున్నాను. నా చదువు పూర్తయింది. జగన్నాథంగారు మాట నిలబెట్టుకున్నారు. ఉద్యోగం వచ్చింది.

ఆ పుస్తకాలో, ఆమె మాటలో నావంటి వాణ్ణి ఎంతవరకూ తీసుకువెళ్ళాయా అంటే-

"నిన్ను పెళ్ళాడాలనుంది రచనా!" అనగలిగాను. నా అంతట నేనే అన్నాను.

పడీ పడీ నవ్వింది రచన.

నాకు చాలా కోపం వచ్చింది.

"గుడ్‌బాయ్!" అంది నవ్వు ఆపుకొని.

"నేనేం ఫూల్‌ని కాదు యిప్పుడు" అన్నాను.

"అలాగా! పద! యూనివర్సిటీలో మా మాస్టారున్నారు. మన పెళ్ళి చేస్తారు" అంది.

గొంతులో వేళాకోళం వున్నా కొంత నిజాయితీ వుందని నాకు తెలుస్తోంది. ఆ ప్రొఫెసర్ గారు ఆధ్వర్యం వహించిన ఓ పెళ్ళికి రచనతోబాటే నేనూ - ఓ మారు వెళ్ళాను.

నేను ఆలోచనలో ఉన్నాను.

"పెళ్ళి యిద్దరు వ్యక్తుల పూర్తి ప్రైవేటు వ్యవహారమని మా నాన్న అంటాడు. ప్రైవేటు ఆస్తితో పుట్టిన పెళ్ళి సోషల్ కన్వీనియన్స్‌కే ఉపయోగపడింది. ఎవరెలా చెప్పినా ప్రైవేటు ఆస్తి ఉన్నంత కాలం ఆది వ్యక్తుల ప్రైవేటు వ్యవహారం కాలేదు. కేవలం సోషల్ వ్యవహారమే అవుతుంది" అంది.

"నీ మాటల గారడీ వదిలిపెట్టు. ఏమంటావో చెప్పు."

"అబ్బాయ్! నీలాంటి బుచ్చిబాబులని కట్టుకుని విమలలాగా ఉపన్యసిస్తూ బ్రతకాలని ఎవరనుకోరు! నేను మాత్రం అనుకోను."

"సో... నన్ను రిజెక్ట్ చేస్తున్నావు."

"ఆర్యూ సీరియస్..."

"అవును!"

"నేను చాలా డేంజరస్! నా దగ్గర ఒకటి కూసి యింకోటి చేసావా-?"

"ఏం చేస్తావ్!" అన్నాను బింకంగా.

"మన పెళ్ళి కార్డులు ప్రింటు చేయించి పంచుతాను"

జోక్ చేస్తోందని తెలిసిపోయింది.

"యింకా?'

"ధాం ధాం ధాం అని పేల్చేస్తాను" అంది.

"నీకూ నన్ను పెళ్ళాడాలనుందన్న మాట"

రచన కొంతసేపు మాట్లాడలేదు. తర్వాత నవ్వింది.

"ఎవరిలోనయినా పెళ్ళికి అర్హమయిన లోపాలు కొన్నీ, అనర్హమయిన లోపాలు కొన్నీ ఉంటాయబ్బాయ్! ఆడపిల్ల ఆ రెంటినీ లిస్టు చేసుకుని కూడికలు తీసివేతలూ చేసుకొని మిగులు తేల్చుకుని యస్సూ, నో చెప్పాలి."

"అర్హమయిన లోపాలా?"

"ఉంటాయి సుబ్బయ్యా! చదువుంది. ఉద్యోగముంది. ఆస్తి కూడా వుంది. మగాడివే - మీసం వుంది. ఇవన్నీ నీ అర్హతలు. అలా పై వాళ్ళు భావించితే అదో రకం! ఇన్నున్న మమ్ములను ఏ కన్య మెచ్చకుండును - పరమాల వేయకుండును - అని నీ బోటి కుర్రగాండ్రు భావించితే వారుత్తి సన్నాసులన్నమాట. అదీ అర్హతల లోపం"

ఆ తర్వాత నన్ను అనర్హుడిని చేసే లోపాల గురించి అడగలేదు. రచనతో పెళ్ళి మాట అనగలిగానన్న మత్తూ, ఆమెను ఒప్పించగలిగానన్న మత్తూ కొంచెం కొంచెం తగ్గాయి.

కొన్నాళ్ళు నేను భయాందోళనలతో గడిపాను. లైబ్రరీకి ఆమె ఎప్పుడయినా వచ్చేది. బీయే పూర్తి చేసి చదువు కొనసాగిస్తుందనుకున్నాను. వేస్టు - అని మానేసింది. లైబ్రరీకి వస్తే నవ్వేసి ఊరుకునే వాడిని. తనూ అంతే!

'నీ పెళ్ళి ప్రయత్నాల్లో వున్నాను. ఉన్న పళాన రా!' అని రాసాడు నాన్న.

వెళ్ళలేదు.

ఆయనే వచ్చాడు. వస్తూనే నా మీద పడిపోయాడు. నీకు మగతనమే లేదన్నాడు.

"ఆ జగన్నాధం సామాన్యుడేం కాదు. నీకు ఉద్యోగం వేయిస్తానంటే ఉద్ధరిస్తాడను కున్నాను. వాడిని తగలేసినంత ఉంది, పైగా సంపాదించాడు కూడా! ముగ్గురు కూతుళ్ళకూ సమానంగా పంచినా లకారానికి పైగా ముడుతుంది. ఆ పిల్లల్నీ మంచి మాటలాడుకోలేక పోయావు" - అని తిట్టాడు.

అన్నీ అని - "అయిందేదో అయింది. నిక్షేపంలాంటి సంబంధాలొస్తున్నాయి. పది హేనూ యిరవయ్యా యిస్తామని కబుర్లు పెడుతున్నారు. ముష్టి వెధవలా ముడుచుక్కూర్చోకు - నేను కార్డు రాసినపుడల్లా వచ్చి తగలడు" అన్నాడు.

నా సంపాదన వచ్చాక ఆయన కొంచెం తగ్గి మాట్లాడుతున్నాడు. నేను దేనికీ అవునూ కాదూ అని చెప్పకుండా నెట్టుకొచ్చాను.

ఆయనని కారెక్కించి వచ్చాక నాకు గాలి ఆడింది. ఎందుకో తెలీదు - మా నాన్నంటే నాకు భయమే వున్నా చిన్నతనంలో నాకు ఆయన పక్కనుంటే గొప్ప ధైర్యంగా ఉండేది! నన్ను ఎవరూ ఎత్తుకుపోలేరు, నా మీద పడి ఎవరూ కొట్టరు అన్న ధీమా కాబోలు! రచనతో పరిచయమయాక మరో నాన్న దొరికినట్లుండేది. అన్నీ తనే చూసుకుంటుంది. మనం దేనికీ వెదుక్కోనక్కరలేదు అన్నట్లుండేది.

ఆ రోజు చాలా సేపు బీచిలో గడిపాను.

రచన గురించి ఆయనతో చెప్పే ధైర్యం నాకు లేదని నిశ్చయించుకున్నాను.

ఈ మాట రచన దగ్గర అనగలననీ నాకు తెలుసు! 'అయితే పద - మాస్టారింటికి' అని అంటే వెళ్ళే ధైర్యమూ నాకు లేదు.

తనంత తనే తీసుకుని పోయి నన్ను రచన పెళ్ళాడాలి - అనుకునే వాడినని గుర్తు.

మా నాన్న కార్డులు వస్తున్నాయి.

రచన కనిపిస్తోంది. పై పై మాటల్తో గడిపేస్తోంది. ఆమెతో ఎవరెవరివో కొత్త ముఖాలు కనిపిస్తున్నాయి. పేర్లు తెలీకపోయినా రచన స్నేహితులని తెలుసు. మా గ్రంథాలయంలో వాళ్ళ సభలు జరుగుతుంటాయి. రచన ఎన్నడూ పిలవలేదు. నేను వెళ్ళలేదు. వాళ్ళంతా ప్రపంచాన్ని మార్చి పారేద్దామన్న ఉద్రేకంలో వున్నారు. నన్ను మార్చుకునే శక్తి లేకుండా వున్నాను నేను.

రచన దూరమవుతున్నదేమోనన్న భయం కన్న నన్నూ, నా ఆఫర్‌ని చాలా తేలికగా తీసుకున్నదన్న భావన భరించరానిదిగా వుండేది.

ఓ రోజు అణుచుకోలేకపోయాను.

మేడ మీద వుంది రచన. రాచకొండ విశ్వనాథశాస్త్రిగారు మాట్లాడుతున్నారు. సాహిత్యాన్ని పెట్టుబడి ఎలా భ్రష్టు పట్టించగలదో చెపుతున్నారు.

నాకు దుర్భరంగా ఉంది.

"రచనా!" అన్నాను పక్కన కూర్చుని.

నా వైపు తిరిగింది.

"నీతో మాట్లాడాలి!" అన్నాను.

"సభ అవనీ!"

"ప్లీజ్!"

"పద!" అంది.

కలెక్టరాఫీసు దాకా నడిచాం! ఒక్క ముక్క మాట్లాడలేదు. చటుక్కున ఆగింది రచన.

"నువ్వేదో మాట్లాడతానన్నావు. అదేంటో నాకు తెలుసు. నువ్వు ఏదీ మాట్లాడలేవు. అదీ నాకు తెలుసు. నేను ఏం అన్నా నువ్వు ఒప్పుకుంటాననీ తెలుసు. కానీ... నిన్ను మోసి నా శక్తిని వ్యర్థం చేసుకోవటం యిష్టం లేదు ఎందుకంటే..."

"చెప్పు"

"నువ్వు హర్టవుతావు"

"నీకా హక్కుంది - చెయ్యి"

"నువ్వు నపుంసకుడికి! పుంస్త్వమంటే సృష్టించే శక్తి! నీలో అది లేదు - నా ప్రయత్నాలు వ్యర్థం - కొందరు కుర్రవాళ్ళు పుట్టుకతో వృద్ధులు"

ఆమె ఉద్దేశ్యమూ, భావమూ నన్ను ఉద్రేక పరచలేదు. ఆమె వాడిన పదం నన్ను నిలువునా దహించింది. ఆమె నించి పరుగెడుతున్నట్లుగా పదో నంబరు బస్సు ఎక్కాను.

మర్నాడు గంగనాపల్లి వెళ్ళాను. తొండంగిలో ఓ సంబంధం. చంద్రమాంపల్లె, మల్లేపల్లిలో మరో రెండూ చూసాము. ఓ వారం రోజులు నన్ను బుట్టలో పెట్టుకుని పెళ్ళి కొడుకండోయ్ పెళ్ళికొడుకు' అంటూ మా నాన్న ఊళ్ళన్నీ తిరిగాడు.

ఈ వారంలోనూ రచనను చాలా నీచంగా ఊహించుకోవటానికి వ్యర్థ ప్రయత్నాలు చేసాను.

దేముడి దయవల్ల మా నాన్నకీ లాభసాటి బేరం దొరకలేదు. కొన్నింటికి మేం నాసిగా కనబడి పెండింగులో పెడితే, కొన్ని మాకు నాసిగా కనబడి మా నాన్న పెండింగులో పెట్టాడు.

"నీ రాత తిన్నగా లేదు! ఈ సారయినా కార్డు అందుకునివచ్చి తగలడు" అన్నాడు కారు ఎక్కిస్తూ.

నాకు చాలా భయంగా ఉంది.

రచన వచ్చి కట్టుకున్న పుణ్యమేమిటంటే నాన్న అనే గొడుగును నాకు కాకుండా చేసింది.

బదిలీ కోసం జగన్నాథంగారిని కలిసాను.

'చూద్దాంలే' అన్నాడు.

ఇల్లు మార్చేసాను.

రచనను భరించే శక్తి నాకు లేదు అని నాకు నేను నచ్చచెప్పుకునే వాడిని.

గ్రంథాలయానికి కూడా రచన రావటం లేదని నాకు గుర్తవుతూనే ఉంది. ఆరు నెలలు గడిచిపోయాయి. రచన కోసం నా సమ్మతి లేకుండా నేను తీవ్రంగా ఎదురు చూసాను.

సరిగా అలాంటప్పుడు రచన వచ్చి శుభలేఖ యిచ్చింది.

రెండు మూడు రోజులనుకుంటాను - మనిషిని కాలేకపోయాను. కావాలనుకుంటే రచనని తిరిగి సాధించగలననిపించింది. పథకాలు సిద్ధమయేవి. ఊహల్లోనే ఉడిగి పోయేవి.

రచన యింక పూర్తిగా వదిలేసింది. నిర్భయంగా పెళ్ళి చేసుకోగలను. నిస్సంకోచంగా జీవించగలను అనిపించేది. అందుకూ పథకాలు తయారయేవి. అవీ నన్ను ఊపకుండా ఆపలేకపోయాయి.

సింహాల దేవిడీలో వాళ్ళింట్లో కలియటానికి వెళ్ళాను.

రచన యింట్లో గొడవగా ఉందనుకుంటాను. రాజగోపాలం నన్ను వదలలేదు.

"ఆనాడు నేనేదో చేసాను. అనుభవించాను. అనుభవం మీద చెబుతున్నాను. ఇవేవీ అయేవి కావని! ఉన్నదొకర్తె - అది సుఖంగా ఉంటే చాలని! వింటం లేదు. తాడూ బొంగరం లేని వాడిని కట్టుకుంటోంది. కనీసం వాడిని తీసుకొచ్చి చూపించలేదు. పోనీ రిజిష్టర్డ్ మారేజయినా చేసుకో లీగల్‌గా ఉంటుంది - సెక్యూరిటీ ఉంటుంది. అన్నాను. నిన్ను వాడు వదిలేస్తే? అని అడిగాను. ఇవన్నీ ఉన్నప్పుడు మాత్రం ఎవరూ ఎవర్నీ వదిలెయ్యరా - అంటుంది" అంటూ మొత్తుకున్నాడాయన.

రచన లేదు. ఏవో నాలుగు అవకతవకల ముక్కలు అని బయటపడ్డాను.

రచన దూరమయిందన్న బాధ క్రమంగా ఆమె కేమవుతుందన్న బాధగా మారింది. 'పెళ్ళి'కి వెళ్ళలేదు.

పది రోజుల తర్వాత రచన వచ్చింది. మీటింగ్‌ట! పర్మిషన్ కోసం వచ్చిందిట!

"పద! కాఫీ తాగుదాం" అన్నాను.

"టైం లేదు"

"మీ ఆయనంటే భయమన్నమాట"

"పద!" అంది నవ్వి.

బయట బాగా ఎండగా ఉంది.

"ముందుగా అపాలజీస్! పెళ్ళికి రాలేకపోయాను. తర్వాత... శుభాకాంక్షలు! నీ వివాహ జీవితం మూడు సమ్మెలూ ఆరు ఉద్యమాలుగా వర్ధిల్లాలి!"

"మాటలు బాగా నేర్చావ్!" అంది.

"నాకు గురువెవరూ! ఎందుకు రావు ... చిలకపలుకులూ"

ఇద్దరం కూర్చున్నాక తనకి కాఫీ నాకు టీ చెప్పాను.

"నా అలవాట్లింకా గుర్తున్నాయే!" - కాఫీ సిప్ చేస్తూ అంది.

"సుఖంగా ఉన్నావా?" - మళ్ళీ గడ్డకడుతున్న మౌనాన్ని భగ్నం చేసాను.

"తెలీదు!"

రచన నిర్వికారంగా ఉందా - ఉంటుందన్నది నా భ్రమా - నాకు తెలీదు.

"సరిగా చెప్పు"

"గోపీ యింపొటెంట్"

"రిడిల్స్‌లో మాట్లాడకు" - నా గురించి అన్న మాటలు గుర్తు చేసుకుంటూ అన్నాను.

"రిడిల్స్ కాదు. గోపీ శారీరకంగా నపుంసకుడు" అంది.

రచన లాంటి ఆడపిల్ల చూసుకోకుండా చేసుకుంటుందా! అన్న ఊహ మెదిలింది.

అలా మెదిలిందని మనసు గిజగిజా కొట్టుకుంది.

"డాక్టర్ని చూడొచ్చు గదా!"

"అవన్నీ ఎప్పుడో చూసాడట"

"తెలిసే చేసుకున్నావన్న మాట!"

"దగా చేసాడా బాస్టర్డ్" అంది. రచన పెదాలు అదురుతున్నాయి.

నా ఆలోచనలు అదుపు లేకుండా సాగుతున్నాయి. మెల్లగా అన్నాను – "నీ లాంటి వాళ్ళు కూడా యింత చిన్నదానికి...."

"ఏం? మాకు కోరికలు ఉండగూడదా?" సూటిగా అంది.

"ఆహ్! అది కాదు నా ప్రశ్న!యింత స్వల్ప విషయాన్ని నీ లాంటి వాళ్ళు చిటికెలో పరిష్కరించుకోగలరు కదా అని"

"ద్వంద్వార్థాలు నేను నేర్పలేదు – ఆత్రేయ పాటలు కంఠతా పడుతున్నావా!"

"సారీ రచనా! నీకన్న ఎంత కిందనున్నావో నీ కన్నా బాగా నాకు తెలుసు! నీ గురించి నీచంగా మాట్లాడడం – ద్వంద్వార్థాలు మాట్లాడడం – నాకు అసాధ్యం! నీతో నడవలేని మనిషినే కావచ్చు. నిన్ను పూజించకుండా వుండలేనివాడిని"

రచన నా చేతిపై చేయి వేసి నొక్కింది.

"నేను సారీ చెప్పాలి! ఉద్రేకంలో లేకపోతే నిన్ను అపార్థం చేసుకునేదాన్ని కాదు"

మాట పూర్తి చేస్తుందేమోనని చూసాను.

"ఏదో చెప్పాలనుకుంటున్నావు" అన్నాను.

"నీకు అర్థమవదేమో!"

"ప్రయత్నిస్తాను. చెప్పు"

"ఒకమారు నీతో అన్నాను ప్రైవేటు ఆస్తి ఉన్నంతకాలమూ పెళ్లి యిద్దరు వ్యక్తుల ప్రైవేటు వ్యవహారం అయే అవకాశం లేదని! దాన్ని రద్దు చేయాలని పోరాడే వాళ్ళూ దీనికి మినహాయింపు కాదు. ప్రైవేటు ఆస్తి రద్దవాలనే వాళ్ళని పెళ్ళాలని కూడా సోషలైజ్ చేస్తారని వెక్కిరించారు కూడా! మా యిద్దరి పెళ్ళీ ఓ కన్వీనియన్స్ కోసమే జరిగింది. మా స్వంత అభిరుచుల కన్న, ఆనందాల కన్న మా సిద్ధాంతం పట్ల మమైక్య భావనే మా వివాహానికి దారి తీసింది. మా నడకకి అసౌకర్యం కలగకుండా ఉండడమే మా వివాహానికి ఆధారం"

అర్థమయిందా అన్నట్లు చూసింది రచన.

"అర్థమయింది. నీ వాదాన్నీ, నిన్నూ సమర్థించలేను గాని నిన్ను అభినందిస్తున్నాను– తప్పటం లేదు"

నా సమర్ధన గాని, అభినందనగానీ తనకు అప్రధానమన్నట్లు కొనసాగించింది రచన.

"గోపీ - తన లోపాన్ని చెప్పలేదు"

"చేసుకునే దానివి కాదుగదా!"

"అలాంటి భయం నీకు వుంటే నేను అర్థం చేసుకోగలను - ఎంచేతనంటే మన మధ్య ఉండడానికి అవకాశం వున్నది కేవలం గాలి. ఊహ. మనోకల్పన. మన మధ్య పరస్పర విశ్వాసానికి అవకాశం ఎంత వుందో అవిశ్వాసానికీ అంతే అవకాశం ఉంది."

"నిజమే కావచ్చు" - సాలోచనగా అన్నాను.

"మాది అలా కాదు. పూర్తిగా ఫెయిర్ ప్లే మాది. స్పష్టత, నిర్దుష్టత మాకు ప్రాణావసరం! అవగాహన లేకపోతే ఒక్క అడుగు పడదు. విశ్వాసం లేకపోతే - ఒకరిపై ఒకరికి నమ్మకం లేకపోతే - మా ఉనికికే అర్థం లేదు. అలాంటప్పుడు - యీ విషయాన్ని ఎందుకు గోపీ చెప్పలేకపోయాడు?

ఆ ప్రశ్నకు నేనేదో జవాబిచ్చుకోగలను.

నావంటి అమ్మాయిని పెళ్ళాడితే కాపురానికి కట్టుబడి వుంటుందన్న భావన గోపికీ ఎలా వచ్చింది? తల వంచుకుని కర్మనో, విధినో తిట్టుకుంటూ - నా లాంటి మనిషి కూడా తనతో బ్రదికేస్తుందనుకున్నాడంటే!!

బహుశా వివాహమనేదానికి ఆడదాని మీద ప్రత్యేకంగా వున్న పట్టు గోపీకి తెలుసు.

ఇప్పుడు అదే అంటాడు - మనం భావాల కోసం, సిద్ధాంతాల కోసం చేసుకున్నాం! మనం కూడా శరీర వాంఛలకు లొంగిపోవాలా?

ఏమిటీ గోపీ ఉద్దేశ్యం?

మంత్రాలూ, తంత్రాలూ, పాతివ్రత్యాలూ, నీతులూ గతంలో ఆడవాళ్ళను ఎలా బంధించాయో, ఎన్ని క్రౌర్యాలను, ఎన్ని మోసాలను, అవమానాలను స్త్రీల బ్రతుకుల్తో బాటు మోసేటట్టు చేసాయో - యీనాడు సిద్ధాంతాలూ, భావాలూ అదే పనిని నిర్వహించగలవని గోపీ ఉద్దేశ్యం. ఉద్దేశ్యమేంటి - నమ్మకం.

ఇది అతను నా భావాలను వాడుకోవటం కాదా? నా సిద్ధాంతాల స్థాయిని దిగజార్చటం కాదా? వాటి పట్ల వాడికున్న అవగాహనారాహిత్యం కాదా? అవిశ్వాసం కాదా?"

రచన తల అటూ యిటూ తిప్పుతోంది. ఆమె సందిగ్ధతలో ఉందనిపిస్తోంది.

"నువ్వన్నది నాకు ఏమీ అర్థం కాలేదు"

"మా స్నేహితులకీ అర్థం కాలేదు. వదిలెయ్! మళ్ళీ పెళ్ళాడు" అంటారు. వాడు చేసిన చీటింగ్ సంగతి ఏమిటి? దానికి శిక్ష అవసరం లేదా? అని ప్రశ్నించాను"

రచన మళ్ళీ మాటలు ఆపింది.

"ఏమన్నారు?"

"అవసరమే అన్నారు. ఒప్పుకున్నారు. కానీ..."

"చెప్పు"

"మిగిలిన వాళ్ళ సంగతేమిటి?"

చాలాసేపు యిద్దరమూ మాట్లాడలేదు. మెల్లగా అంది.

"ఈ దేశంలో కోర్టులున్నాయి. తీర్పుల్నిస్తాయి. పార్లమెంటుంది. చట్టాలు చేస్తుంది. జరిగిన దగా గురించి గోపికి శిక్ష పడాలని కోర్టు కెక్కుతాను. వివాహానికి ముందు వధూవరులిద్దరూ శారీరకంగా దాంపత్య జీవితానికి అర్హులేనని డాక్టర్ సర్టిఫికెట్ ఉండాలని చట్టం తీసుకురావటానికి జీవితం వినియోగిస్తాను"

రచన మాటలు యీసారి నాకు అర్థమయాయి. ఆమె పురుష ద్వేషి అనిపించింది.

మరుసటి నెలలోనే నాకు భారీ కట్నంతో పెళ్ళయింది. వెంట వెంటనే యిద్దరు ఆడపిల్లలు పుట్టారు. రచన ప్రభావం పూర్తిగా తొలగిపోయింది. సంపాదనలో పడ్డాను. మా నాన్న వారసత్వాన్ని అందుకున్నాను.

ఇళ్ళ స్థలాలు కొన్నాను. అమ్మాను. యిల్లు కట్టాను. వ్యాపారాలు చేసాను. పేపర్లో షేర్ ధరవరలు మాత్రమే చూస్తున్నాను. మా ఆవిడ ఒంటి నిండా నగలతో చుట్టాల పెళ్ళిళ్ళలో పెత్తనం చెలాయిస్తుంటే అంతా నా సలహాలనూ, సహాయాలనూ అర్థిస్తున్నాను.

రచన రగిలించిన వేడి పూర్తిగా దూరమయింది. పదిహేడేళ్ళు గడిచిపోయాయి.

'మీ అమ్మాయికీ పెళ్ళెప్పుడూ' అని మా వాళ్ళు అడుగుతూంటే మాత్రం నాకు రచన గుర్తు వస్తోంది.

రచన కోర్టు కెక్కినా, మానినా అలాంటి చట్టం కోసం కృషి చేసిందో లేదో తెలీదు - రచన ఏమయిందో తెలీదుగాని కృషి చేస్తే బాగుండుననిపిస్తోంది.

---

*ఈ కథ 'రచన'ను చదివిన మీదట -*

*1.* వివాహానికి ముందు వైద్య పరీక్ష గురించి చట్టం అవసరమంటుంది రచన. మీరు సమర్థిస్తారా? వ్యతిరేకిస్తారా? ఎందువల్ల?

*2.* వ్యక్తులుగాని, స్వచ్ఛంద సంస్థలుగాని చట్టాలను తెచ్చి, ఉన్న చట్టాలను మార్చి, సామాజిక సంస్కరణ కోసం ప్రయత్నించారా? అలాంటి సంఘటనలనూ, ప్రయత్నాలనూ గూర్చి చెప్పండి.

*3.* కథకి సంబంధించిన లోపాలనూ, బలాలనూ వ్రాయండి.

ఈ మూడు అంశాల మీదా ఉత్తమ అభిప్రాయాలకు తగిన బహుమతులు ఉంటాయి.

- రచయిత

## కథాప్రహేళికలో కలం పట్టిన పాఠక మహాశయులకు అభినందనలు!

తెలుగు పత్రికలూ, సినిమాలూ సెక్సూ, హింసలతో నిండి వుంటున్నాయనేది అందరూ గమనించగల విషయం. వాటి వల్లనే అమ్మకాలు జరగగలవని చాలామంది భావన.

అంటే – తెలుగు పాఠకులూ, ప్రేక్షకులూ వాటిని కోరుకుంటున్నారన్న మాట!

అయితే –

'కథాప్రహేళిక'లో వెలువడుతున్న కథల మీద వస్తున్న అసంఖ్యాకమైన లేఖలూ, విమర్శలూ పూర్తిగా భిన్నమైన విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. వారికి సెక్సు రచనల పట్ల అసహ్యముంది. చాలా బలంగానూ, తీవ్రంగానూ వారు సెక్సు రచనలను వ్యతిరేకిస్తున్నారు. "కథను సహజత్వానికి దగ్గరగా మలచడానికి ప్రతి కథకుడూ ప్రయత్నించటం న్యాయమే – అశ్లీల పదాలు పాత్రలు నైజాన్ని చూపించటానికే అయినా పదే పదేవాడటం కథాశిల్పానికి ఏ మాత్రం సహాయపడదు" అని 'బురద' కథ గురించి సున్నితంగా తెలియజేసిన వారున్నారు. "సెక్స్ సైన్స్ పేరుతో సంభోగ శృంగారాన్ని, సెంటర్ సెన్సేషన్ పేరుతో కామ కలాపాలని, అడపాదడపా సర్క్యులేషన్ మెయిన్‌టేనెన్సు కోసం అసభ్య శృంగార కథల్ని పోషిస్తూ పొట్టగడుపుకుంటున్న నేటి పత్రికా ప్రపంచంలో నిలబడాలంటే ఏమిటి తరణోపాయం?" అని ఆలోచించి, ఆలోచించి, చివరకు తెలివిగా 'రచన' ఈ 'కథాప్రహేళిక' పేరుతో 'మెరక వీధి కథలు' వ్రాయిస్తోందేమో ననిపిస్తుంది" అని తీవ్రంగా అనుమానించిన వారూ ఉన్నారు.

ఇంత వ్యతిరిక్తత ఉన్నా పరిస్థితులు యిలా ఉండడానికి కారణమేమిటి?

బహుశా –

సాహిత్యానికి సంబంధించి జవాబు వెతుక్కుంటే – పాఠకులు తమ భావాలను 'బలం'గా వ్యక్తపరచకపోవటం ఓ కారణమయుండాలి. బలం 'సంఖ్య'లోనూ ఉంది. అలాగే వ్యక్తం చేసే 'నేర్పు'లోనూ ఉంది. మననెవరు పట్టించుకుంటారన్న ఉదాసీనత విడిచిపెడితే, తమ భావాలనూ, స్పందనలనూ తెలియబరచటం కర్తవ్యంగా భావించితే, 'సంఖ్య' పెరుగుతుంది. ఎవరూ దేన్నీ పుట్టుకతో పొందలేనట్లే 'వ్యక్తం చేసే నేర్పు'ని కూడా పొందలేదు. అభ్యాసంతో దానిని సాధించవచ్చు. నూతన రచయితల కోసం శ్రీ కాళీపట్నం రామారావుగారు 'కథాకథనం' వ్రాసారు. ఇలా సమర్థులు రచనలపట్ల ప్రాథమిక జ్ఞానాన్ని రచయితలకు ఇవ్వడానికి ప్రయత్నించినట్లే పాఠకుల కోసం ప్రయత్నించరాదా? స్టోరీ ఎప్రీసియేషన్ వంటివి యింగ్లీషులో వున్నాయి. అనుభవించే శక్తి అందరికీ ఉంటుంది. తమకు అవసరం లేని దానిని చెప్పే నేర్పు కొద్ది ప్రయాసతో సాధించవచ్చు. కథకి

సంబంధించి పోరంకి దక్షిణామూర్తిగారి 'కథానిక – దాని స్వరూప స్వభావాలు' ఆసక్తిగల పాఠకులకు ఉపయుక్తంగా ఉంటుంది.

పోతే -

వివాహానికి ముందు దంపతులిరువురికీ ఆరోగ్య పరీక్షల అవసరముందని దాదాపు అందరూ అభిప్రాయపడినా, చట్టాల అమలు పట్ల అపనమ్మకం చూపారు చాలామంది. ఇటీవలి కాలంలో చట్టాల కోసం కృషి చేసిన వ్యక్తులను ఎరగమంటున్నారు. చట్టాల పట్ల నిరాశ, నిస్పృహ, నిరాసక్తత అనేక ఉత్తరాలు వ్యక్తపరుస్తున్నాయి.

'కథనం' నచ్చినట్లు ఎక్కువమంది పేర్కొంటే, 'రచన పాత్ర' అస్పష్టంగా ఉందని కొందరు అభిప్రాయపడ్డారు.

కథలో తమకు కనిపించిన బలాన్నీ, లోపాన్నీ, స్పష్టంగా, క్లుప్తంగా, అందంగా చెప్పిన రవి, రవిచంద్ర (దాచేపల్లి) గారికి 'నచ్చిన అంశం'లో ప్రథమ బహుమతి.

కథ చెప్పిన పాత్ర 'సగటు మానవనిగా కథ చెపుతూ సాధించిన 'బాలన్సు' గమనించిన రవీంద్ర (జగ్గంపేట) గారికి ద్వితీయ బహుమతి.

రచన పాత్రలోనూ, కథలోనూ తమకు కనిపించిన 'అస్పష్టతను వివరించిన డి.సంపత్ కుమార్ (నల్గొండ) గారికి 'నచ్చని అంశం'లో ప్రథమ బహుమతి.

కథలోది 'రేర్' సమస్యగానూ,ఒక వామపక్ష నాయకుడు అలాంటి మోసం చేయటం – అవాస్తవంగానూ, శారీరక సమస్యతో అందోళన పడకుండా సిద్ధాంతాల వెనుక పరిగెడతాడా అంటూ ప్రశ్నిస్తున్న డా॥ యం.విజయగోపాల్ (హైదరాబాద్) గారికి ద్వితీయ బహుమతి.

విశ్లేషణలోని నైశిత్యాన్ని, వైవిధ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ ఎంపిక చేయడం జరిగింది. స్థలాభావం వలన మరెన్నో ఆసక్తికరమైన విశ్లేషణలను ప్రచురించలేకపోతున్నాం!

**నచ్చిన అంశం**

### ప్రథమ బహుమతి పొందిన విశ్లేషణ

మేం పనిచేసే సంస్థలో చాలా యూనియన్లున్నాయి. యే యూనియన్ సభ్యుడు ఆ యూనియన్ ఆదేశాలకు లోబడి వుండాలి. అన్ని యూనియన్లు కోరేది కార్మిక సంక్షేమమే కాని నిజానికి యూనియన్ల పొలిటిక్స్‌లో బలయ్యేది కార్మికుడే! రకరకాల కులాలు, మతాలు లాగా యూనియన్లు కూడా తయారయ్యేయి.

ఈ కథలో పాతివ్రత్యమూ, నీతితో కాక సిద్ధాంతాలతో, భావాలతో స్త్రీని కట్టి పడెయ్యాలనుకున్న గోపీ వుద్దేశ్యం లాంటి నమ్మకాన్ని –, సిద్ధాంతాల పట్ల అవగాహన్ని, అవిశ్వాసాన్ని రచన పాత్ర స్పష్టంగా ఖండిస్తుంది.

ముఖ్యంగా ఈ కథలో 'అతడు యింపోటెంట్' అన్న విషయం కన్నా అది దాచి

మొత్తం వ్యవహారాన్ని ఎగతాళి చేసినందుకు రచన నిర్ద్వంద్వంగా నిందిస్తుంది. ఫెయిర్ ప్లే అనుకుని స్పష్టత, నిర్దుష్టత ప్రాణంగా తలచి విశ్వాసంతో, నమ్మకంతో, అవగాహనతో - 'గోపీ నేనూ పెళ్ళాడుతున్నాం' అనగలిగిన రచనకు గోపీ చేసింది - రచనకు మాత్రమే కాదు. సిద్ధాంతాలకు, భావాలకు, సమాజానికి దగా, వంచన. అతడికి తప్పనిసరిగా శిక్ష పడాలి. ఆదర్శవంతమైన భావాలున్న గోపీలోనే నిజాయితీ లోపించినపుడు సామాన్యుల్లో అది విషయమే కాదు. అందుకనే - ముఖ్యంగా అందుకనే - వివాహానికి ముందు 'వధూవరులిద్దరూ ఫిజికల్‌గా అర్హులేనని' డాక్టరు సర్టిఫై చేయాలని కోరటం - సమంజసం. తెలిసిన కథలు కొన్ని - తెలీని వెతలు ఎన్నో?!

రామ్మోహనరాయ్ ప్రయత్నంగా రద్దయిన సతీ సహగమనం! వీరేశలింగం తదితరులు పోరగా పోరగా పోయిన బాల్య వివాహం!! యిలా ప్రయత్నాల ద్వారా, వుద్యమాల ద్వారా సామాజిక సంస్కరణ కోసం చట్టాలను మార్చటం అవసరమూ, అనివార్యమూ!!!

ఈ మధ్య 'రాత్రి పక్షులు' (నాటి దేవదాస్‌ల నుండి నేడు పిలిస్తే వచ్చే అమ్మాయిల వరకూ) అనే పుస్తకం ఒకటి వచ్చింది. దాంట్లో 'వ్యభిచారాన్ని చట్టబద్ధం చెయ్యాలంటూ' రచయిత్రి సమాజంలో వేశ్యల జీవితాన్ని పరిశీలించి, పరిశోధించి వెలిబుచ్చిన అభిప్రాయాలు - ముందు ముందు కొత్త చట్టాలకు - చరిత్రలో కొత్త రచనకు శ్రీకారం చుట్టొచ్చు!!! నిరర్ధకమైన మౌనపోరాటాలు, యే తరానికీ పనికిరాని మూడు తరాలు మంచి చర్చనీయాంశాలు-

పోతే కథకు సంబంధించి కేవలం రచన గోపీని 'ఓ కన్వీనియన్స్ కోసమే చేసుకుందా?!' యే రకమైన అభిరుచి, ఆకర్షణా లేకుండా - స్పష్టంగా చెప్పాలంటే కళ్ళల్లో మెరుపు, హృదయంలో స్పందన, నెత్తుట్లో అలజడి యేవీ లేకుండానే!

ఆ విషయమై వివరణ కథలో లేదు. 'మీ అమ్మాయికి పెళ్ళెప్పుడూ' అని ప్రారంభించి, ముగించి రచయిత మంచి ప్రజ్ఞ చూపించేరు. ముఖ్యంగా (ఆడపిల్లల తండ్రిగా) 'రచన కృషి చేస్తే బావుండున'నే భావం కూర్చి ముగించి -

- రవి, రవిచంద్ర

**ద్వితీయ బహుమతి పొందిన విశ్లేషణ**

'కథా ప్రహేళిక'కు ఆణిముత్యాల్లాంటి కథల్ని ఎంపిక చేయదల్చుకున్నారనిపిస్తోంది. 'రచన' కథ ఎత్తుగడ, నడక, ముగింపు ఎన్నదగినవి. ఇక కథకి మెయిన్ థీమ్ ఎన్నిక విషయంలో రచయిత చక్కని మానవత్వాన్ని నిరూపించుకున్నారు. రచన లాగా ప్రేమ వివాహం కానీండి, పెద్దలు కుదిర్చిన పెళ్ళి కానీండి పురుషుడిలో పైకి కనిపించని వంధ్యత్వం ఎందరు సోదరీమణుల్ని బలితీసుకుంటోందో! రచనలా ధైర్యంగా నిర్ణయాలు తీసుకోగలిగిన వాళ్ళు నూటి కొకరో, ఇద్దరో ఉంటారేమో మన సమాజంలో. మిగిలిన

వాళ్ళంతా కక్కలేక – మింగలేక కుమిలిపోయేవాళ్ళే. "వివాహానికి ముందు వధూవరులిద్దరూ శారీరకంగా దాంపత్య జీవితానికి అర్హులేనని డాక్టర్ సర్టిఫికెట్ ఉండాలని చట్టం తీసుకు రావటానికి జీవితం వినియోగిస్తాను" అంటూ రచన చేత అనిపించిన రచయిత నిజంగా స్త్రీ జాతికి మేలు చేసే ఆలోచన చేసారు. ఒక రామ్మోహనరాయ్ లాగా, ఒక వీరేశలింగం లాగా ఆలోచించి ఒక సంస్కరణ పునాదికి సూచన చేసారు. 'మన దేశంలో అది అమలులోకి వస్తుందా?' అనేది తర్వాతి సంగతి. పురుషాహంకారం మెయిన్‌గా ఉన్న ఏ దేశంలోనూ ఇది అంగీకరించబడకపోవచ్చు. కానీ, బీజం పడింది కదా – ఇక మొక్క ఎప్పటికోప్పటికి మొలకెత్తి తీరుతుంది.

ఈ కథలోని మరో గొప్ప లక్షణమేమిటంటే ఉత్తమ పురుషలో చెప్పబడిన ఈ కథలో ఎక్కడా బేలన్స్ పోకుండా కాపాడుకుంటూ రావడం. 'నేను' కేరెక్టర్ ఒక సగటు మానవుడిగా ఆలోచించడం, అలాగే కంటిన్యూ కావడం కథకి గొప్ప హైలైట్.

అవును – ఆడపిల్లల్లో ఆత్మస్థైర్యం మగాళ్ళకెప్పటికీ అహంకారం లానే కనిపిస్తుంది. సగటు మగాళ్ళు పిరికితనంతో అలాంటి ఆడపిల్లల్నుంచి దూరంగా పారిపోక ఏం చేస్తారు? తన వరకూ వస్తేగాని సమస్య నిజస్వరూపం అర్థం కాదని ఆఖరి వాక్యంలో నిరూపించారు. ఈ మధ్యకాలంలో వచ్చిన అతికొద్ది గొప్ప కథల్లో 'రచన' కూడా చేరుతుంది నిస్సంశయంగా.

– రవీంద్ర

నచ్చని అంశం

ప్రథమ బహుమతి పొందిన విశ్లేషణ

రచన పాత్ర చాల అస్పష్టంగా, అసహజంగా ఉంది. మహాభారతంలో ద్రౌపది "తన్నోడి నన్నోడెనా? నన్నోడి తన్నోడెనా" అనే మీమాంసకు లోనయి అది తెలుసుకోకుండానే అవమానానికి గురి అయింది. అలాగే రచన కూడా "సిద్ధాంతం ఓడి నేనోడానా? నేనోడి సిద్ధాంతం ఓడిందా?" అన్న విషయం అర్థం కాకుండానే పాఠకులకు ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది.

ప్రత్యేకించి రచయిత ఏం చెప్పాలనుకున్నది కూడా అస్పష్టం. మానవ మనుగడకు స్త్రీ, పురుషుల లైంగిక జీవిత విధానమే ఆధారం. దీన్ని ఆధారం చేసుకునే వివాహ వ్యవస్థ కొనసాగుతుందనేది నిర్వివాదాంశం. పూర్వరంగంలో ఇదే గుంపు పెళ్ళిగా, ఇతర పద్ధతులలో కొనసాగించబడేది. రచన లాంటి బ్రాడ్ మెంటాలిటీ అమ్మాయికి గోపి తాను ఇంపోటెంట్ అనే విషయాన్ని వివాహం ముందే చెప్పకుండా ఉండడం, ఈ అంశాన్ని కథలో సృష్టించడం ద్వారా రచయిత రెండు పాత్రలకూ తీరని అన్యాయం చేశాడు. ఎంతో ప్రతిభావంతురాలైన రచన ఎంపిక విధానం గోపీ విషయంలో

లోపభూయిష్టంగా కన్పిస్తుంది. రచయిత గోపీతో, "మనం భావాల కోసం, సిద్ధాంతాల కోసం చేసుకున్నాం. మనం కూడా శరీరక వాంఛలకు లొంగిపోవాలా?" అన్పించడం ద్వారా రచయిత ఏం చెప్పదల్చుకున్నాడు అనేది అస్పష్టం. వాళ్ళిద్దరికీ వివాహం జరపడం ద్వారా "నేను" పాత్రకూ రచయిత ఎంతో అన్యాయం చేశాడు. "నేను" పాత్ర అన్ని విధాలుగా ఎదటగానికి రచన ప్రోత్సహించే అవకాశాలు ఉన్నా అసందర్భంగా ఈ పాత్రనూ వేరే మలుపు తిప్పటం ద్వారా కథలో పట్టు దెబ్బతింది. వ్యవస్థలోని ఏ అంశం మీదా విశ్వాసం లేని రచన కోర్టును ఆశ్రయిస్తాననడం చాలా అసహజంగా ఉంది. విరుద్ధ విషయాల వింత పోకడలతో సాగిన రచన కథానికలోని అంశం కొండను త్రవ్వి ఎలుకను పట్టడమే అన్పిస్తుంది.

ఇకపోతే వివాహానికి ముందు వైద్య పరీక్షకు బదులుగా, వివాహ ప్రసక్తి రాకమునుపే యువతీయువకులు యుక్తవయస్సు రాగానే వైద్య పరీక్ష చేయించుకుని తమ తమ స్థితిని తెలుసుకుని ఉండడం శ్రేయస్కరం. ఇది చాలా సున్నితమైన విషయం. కనుక దీనిపట్ల అందరూ వ్యక్తిగత శ్రద్ధ కలిగి ఉండాలి.

– డి. సంపత్ కుమార్

### ద్వితీయ బహుమతి పొందిన విశ్లేషణ

వివాహానికి ముందు వైద్య పరీక్ష తప్పనిసరి చేయాలి. అందుకు చట్టం కూడా వుండాలి అనేది ఒక తీవ్రమయిన, సమాజాన్ని కుదిపే అభిప్రాయం. చట్టాలున్నా సమాజం చట్టాల దారిలో నడవకపోవడం మనం చూస్తున్నాము. మనకి ఎన్నెన్ని చట్టాలు లేవు. వాటి వలన సమస్యలు పరిష్కారమవుతున్నాయా – అదీగాక ఈ నపుంసకత్వ మనేది నూటికి తొంభై శాతం పైగా మానసికమే, శరీరగతం కాదు.

కథలో చెప్పినట్లు ఏదో లోపమున్నా అది దాచి పెళ్ళి జరపడం, చేసుకోవడం కొన్ని సందర్భాల్లోనే జరుగుతుంది. అలా జరిగిన సమయాల్లో కూడా ఆ జబ్బు పెళ్ళి జరగక ముందునుంచి, వుందని నిర్ధారిస్తే విడాకులకు అది ఆధారం. అంతేగాక శిక్ష కూడా వేయడానికి వీలవుతుంది.

అయితే ప్రస్తుతం ఒక ఆడపిల్ల తండ్రిగా తన కాబోయే అల్లుడి పురుషత్వ స్టేటస్ ఖచ్చితంగా తనకు తెలియడం – పాత అనుభవం దృష్ట్యా ఆశించదగిందే. అలాంటి చట్టం వుండినా బాగుండుననిపిస్తుంది. అలాగే పెళ్లయాక పెళ్ళిలో సెక్స్ కూడా ఒక భాగమని తెలీని అమ్మాయిలు భయపడి పారిపోయి గోలచేసే సందర్భాలు కూడా వున్నాయి.

అయితే ఈ ప్రత్యేక పరిస్థితులు రేర్ కనుక అందరికీ వైద్యపరీక్ష అంటే – అందర్నీ కించ పరచినట్టు కావడమే కాకుండా ప్రాక్టికల్ కూడా కాదు. డాక్టర్ల చుట్టూ తిరగడం, తప్పుడు సర్టిఫికేట్లు, మరల కోర్టు ప్రదక్షిణలు....

రెండవ ప్రశ్నకు - కొన్ని మూఢాచారాలు, అంధ విశ్వాసాలు రూపుమాపడానికై ఒకొక్కప్పుడు పాలకులు కొన్నిసార్లు సంస్కరణ వాదులు నడుం కట్టారు.

1892లో లార్డ్ బెంటింక్ సతీసహగమనాన్ని చట్టపరంగా నిషేధించాడు. ఈశ్వర చంద్ర విద్యాసాగర్, రాజరామమోహనరాయ్ వంటి వారు స్త్రీ విద్య, వితంతు పునర్వివాహం మొదలైన సమస్యల గురించి జరిపిన అవిశ్రాంత పోరాటం మనకి తెలుసు. మన తెలుగునాట శ్రీ కందుకూరి వీరేశలింగం గారి భావ విప్లవం, సామాజిక సంస్కరణా ఉద్యమం మరి సరేసరి.

మహనీయుడు అంబేద్కర్ జీవితమే ఒక సంఘర్షణ.

ఇలా ఈ లిస్ట్ ఎంతవరకయినా పొడిగించవచ్చు.

ఇక ఆధునిక సమయంలో మన ప్రభుత్వం చేసిన చట్టాలు - స్త్రీల ఆస్తి గూర్చి, వరకట్న నిషేధం గూర్చి అందరికీ తెలిసినవే -

యిక కథ విషయానికొస్తే కథారచయిత అనన్యసామాన్యమైన శైలిలో అత్యంత ఆధునికతా కేన్వాస్‌పై తన కథని చిత్రించాడని చెప్పక తప్పదు. రచయిత సమాజంలో ఒక సామాన్యుడి దృక్పథం నించి విషయాన్ని విశ్లేషిస్తూ కథని విస్తరింపచేయడం జరిగింది. కథలో సిద్ధాంత సంఘర్షణ, మనస్తత్వాల బేరీజు, మారుతున్న సమాజంలో మారుతున్న దృక్పథాల సామాజిక న్యాయాల వలయంలో ప్రభావితమయే సామాన్యుల జీవితాలు యివన్నీ ఒక విధమైన ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.

శారీరక సంబంధం లేని సౌందర్యారాధన ప్రేమతత్వం, ప్లేటోనిక్ లవ్ సాహిత్యం లోను, కలలలోను తప్ప జీవితంలో వుండదు కదా. సామాజిక స్పృహలో అగ్రగామి, వామపక్ష నాయకుడు అయిన గోపి సమాజంలో అట్టడుగునున్న వ్యక్తి కోసం చూపే ఆవేదనలో కించిత్తయినా తన స్నేహితురాలి కోసం చూపలేకపోయాడు. పైగా మోసం చేసాడు. వాస్తవంగా అలా జరుగుతుందా అని? అసలు నపుంసకుడైనవాడు ముందర ఆ సమస్య గూర్చి ఆందోళన పడకుండా సిద్ధాంతాల గోల వెనుక పరిగెడతాడా?!

ఇక 'రచన' జీవితం, భవిష్యత్తు ఎలా జరిగిందో ఎవరి ఊహకి వారికే వదిలేశారు. కోర్టు కెక్కుతాను, చట్టాలు తెస్తాను. శిక్ష వేయిస్తాను అని ఉపన్యాసం కథలోనయితే చెప్పింది. కాని జీవితంలో ఏమయిందో?

మొత్తం మీద కథాకథనం చక్కగా సాగి - ఒక విధంగా ఆదర్శాలు, ఆవేశాలు వెనుక పరిగెట్టేవాళ్ళు ఏ విధంగా దారం లేని గాలి పటాలవుతారు, రచయిత లాంటి ప్రాక్టికల్ మనుషులు ఏ విధంగా వ్యాపారాలు చేస్తారు, ఇళ్ళ స్థలాలు కొంటారు, బంగారం భార్యల మెడలో అలంకరిస్తారు అనే విషయాలు చక్కగా వివరించారు రచయిత!

- డా. యం. విజయగోపాల్